క్లుప్తంగా

బంద్ విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నెల్లిమర్ల: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈనెల 8న చేపట్టనున్న విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కోరారు. ఈ మేరకు బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రవికుమార్, పవన్‌కుమార్, రవి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో 'స్వచ్ఛ భారత్ - స్వస్థ భారత్'



పట్టణ వీధుల్లో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'స్వచ్ఛ భారత్ – స్వస్థ భారత్' కార్యక్రమాన్ని ఆదిత్య డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు పట్టణ వీధుల్లో భారీ ర్యాలీ చేపట్టి 3కే వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎస్.రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ బి.దామోదరరావు, వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ పీఓలు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక ఓటర్ల శిబిరాలు



కోనాడలోని ప్రత్యేక ఓటరు శిబిరాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ భాస్కరరావు

పూసపాటిరేగ: మండలంలోని 28 పంచాయతీల పరిధిలో శనివారం ప్రత్యేక ఓటర్ల శిబిరాలు నిర్వహించారు. కొప్పెర్ల, నడిపల్లి, పసపాం, తిప్పలవలస, ఎరుకొండ, కోనాడ గ్రామాలలో ఏర్పాటు చేసిన శిబిరాలను తహసీల్దార్ ఇ. భాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు వెంకటరావు, ధనుంజయ, భూషణం, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్తి కళారాధన



భజనలు చేస్తున్న కళాకారులు

నెల్లిమర్ల రూరల్: రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన భక్తి కళారాధన కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. జిల్లా కళాకారుల సంఘ అధ్యక్షుడు అట్టాడ పైడిరాజు ఆధ్వర్యంలో మెరకముడిదాం మండలం చిన బంటుపల్లి గ్రామానికి చెందిన పలువురు కళాకారులు స్వామి సన్నిధిలో సుమారు 4 గంటల పాటు నిర్విరామంగా భక్తి భజనలు చేపట్టారు. స్వామి దర్శనానికి విచ్చేసిన భక్తులు ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

హుకుంపేట టాండ్రీకి తరలిన సిరిమాను

విజయనగరం టౌన్: సిరుల ఉత్సవం పూర్తయిన తర్వాత భక్తుల దర్శనార్థం మూడులాంతర్ల వద్ద ఉంచిన సిరిమానును పైడితల్లి దీక్షాపరుల జయ జయ ధ్వానాల నడుమ శనివారం ఆలయం నుంచి హుకుంపేటలో ఉన్న రాజగోపాల్ టాండ్రీకి తరలించారు. ప్రతి ఏటా టాండ్రీకి సిరిమానును తరలించడం ఆనవాయితీ. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, పైడితల్లి అమ్మవారి దీక్షాపరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

విజయనగరం రూరల్: మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారిణి అరుణకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల శాఖ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణశాఖ, ఎన్ఆర్ఈజీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పనుల ప్రగతిపై చర్చించారు. జగనన్న గృహ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, పంచాయతీ విస్తరణాధికారి డి.తిరుపతినాయుడు, మండల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ప్రక్రియ అభినందనీయం

- నేటి తరానికి ఆస్తులతో పాటు పుణ్యాన్ని పంచిపెట్టాలి
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- రూ.1.50 కోట్లతో నిర్మించిన రెండంతస్తుల భవనం ప్రారంభం



నూతన అన్నప్రసాద భవనం ప్రారంభోత్సవంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, తదితరులు

విజయనగరం: పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో నిత్యాన్నదాన ప్రక్రియ కొనసాగించడం అభినందనీయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. సమాజంలో ప్రతిఒక్కరూ నేటి తరానికి సంపాదించిన ఆస్తులతో పాటు చేసిన పుణ్యాలను పంచిపెట్టాలన్నారు. నగరంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన నిత్య అన్నప్రసాద వితరణ భవనాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం ప్రారంభించారు. రూ.1.50 కోట్లతో నిర్మించిన రెండంతస్తుల నిత్యాన్నదాన ప్రసాద భవనాన్ని కోలగట్ల వీరభద్రస్వామి, శ్రావణ చైతన్యానంద చిన్నస్వామి ప్రారంభించగా.. పుల్కా తయారీ యంత్రాన్ని సీనియర్ కార్పొరేటర్ కేదారిశెట్టి సీతారామమూర్తి.. నారాయణం శ్రీనివాస్ అర్చక భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన కోలగట్లకు ఆలయ మర్యాదల ప్రకారం ఆహ్వానం పలికారు. అనంతరం జరిగిన సభలో కోలగట్ల మాట్లాడుతూ, సామాజిక స్పృహతో కొన్నేళ్లుగా పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం చేపడుతున్నారన్నారు. సామాజిక సేవలో పాలుపంచుకుంటున్న అనేక మంది విజయనగర వాసులు అన్నదాన కార్యక్రమాలలో భాగస్వాములు కావడం అభినందించదగ్గ విషయమన్నారు. ఇప్పటివరకు ఆలయ నిత్యాన్నదాన పథకం ద్వారా 50 లక్షల మంది వరకు అన్న ప్రసాదాన్ని స్వీకరించడం గొప్ప విషయమని చెప్పారు. శ్రవణ చైతన్యానంద చిన్నస్వామి మాట్లాడుతూ, పార్థివ దేహాన్ని కట్టెలతోనే కాల్చుతారు తప్ప.. కట్టలతో కాదన్న విషయం గ్రహించాలని సూచించారు. దాతలు ఎక్కడ ఉంటారో అక్కడి సమాజం వర్ధిల్లుతుందని చెప్పారు. సేవకు నిజమైన మార్గం దాన గుణమేనని.. ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని సూచించా రు. అన్నివర్గాలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అండగా నిలవడం అదృష్టం అన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులకు పండితులు వేదాశీర్వచనాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి పెంటపాటి కామరాజు, స్థానిక కార్పొరేటర్ పిల్ల రాధాభవానీ, ప్రాజెక్ట్ చైర్మన్ బొ డ్డు సత్యనారాయణ, కో ప్రాజెక్ట్ చైర్మన్ మడిపల్లి రామారావు, జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కు మ్మరిగుంట శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్ పెంట పాటి విజయరామయ్య, స్థలదాత మంచుకొండ అ ప్పలరాజు, గ్రంధి గుప్త, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను ఏర్పరచుకోవాలి..

- విశాఖ కలెక్టర్ మల్లికార్జునరావు



కలెక్టర్ మల్లికార్జునరావు సన్మానిస్తున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భోగాపురం: విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎ. మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని చెరుకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కృషి, పట్టుదల ఉంటే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అందుకోగలరన్నారు. తోటి విద్యార్థులతో స్నేహబంధం ఏర్పాటు చేసుకొని ఆధునిక నైపుణ్యాల వైపు దృష్టి సారించాలని సూచించారు. మాజీ మంత్రి, అవంతి కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ టెక్నికల్ స్కిల్స్, ప్రాక్టికల్ నాలెడ్జ్‌పై దృష్టి సారించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత ప్రపంచంలో అభివృద్ధికి అనుగుణంగా కంప్యూటర్ రంగంలో అధునాతన కోర్సులు వచ్చాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్‌థింగ్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లలో ఉద్యోగ అవకాశలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని తెలిపారు. అనంతరం కలెక్టర్‌ను ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ జీవీ రిజిస్ట్రార్ జి. జయసుమ, విశాఖపట్నం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. నాగన్న, ఆపరేషన్స్ సీనియర్ డైరెక్టర్ దాసరి కిషోర్, కళాశాల వైస్ చైర్మన్ ముత్తంశెట్టి శివగణేష్, ప్రిన్సిపాల్ బి. మురళి, డైరెక్టర్ చంద్రశేఖర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు స్పందన



53వ సచివాలయంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18, 53 సచివాలయాలలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు స్పందన లభించింది. నగరంలోని అద్దేపల్లివారి వీధి, అయ్యన్నపేటలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజలు చేరుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి వైద్య సిబ్బంది మందులు ఉచితంగా అందజేశారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించేందుకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి, పౌష్టికాహార ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ, కార్పొరేషన్ సిబ్బంది, కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: విజయవాడలో ఈనెల 15న నిర్వహించనున్న ప్రజారక్షణ భేరి బహిరంగసభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ, విభజన హామీలు అమలు చేయకుండా.. రావాల్సిన నిధులు విడుదల చేయకుండా కేంద్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తోన్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకే ప్రజారక్షణ భేరి కార్యక్రమాన్ని సీపీఎం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తోందని చెప్పారు. అనంతరం బహిరంగ సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వి. లక్ష్మి, రెడ్డి శంకరరావు, టీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద బాధితులకు చేయూత

విజయనగరం టౌన్: రైలు ప్రమాద బాధితులను హార్ట్ ఫర్ నేషన్ మినిస్ట్రీస్ డైరెక్టర్ రివైవలిస్ట్ మధు మనోహర్ శనివారం స్థానిక కేంద్రాస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు బ్రెడ్, పండ్లు, బిస్కెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నదానం..

విజయనగరం టౌన్: నగరంలోని 34వ డివిజన్‌కు చెందిన బాలియోగేంద్ర జ్ఞాపకార్థం శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జ్ మారం బాలబ్రహ్మారెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు సేవ చేస్తూ చిన్నతనంలోనే అకాల మరణం పొందిన యోగేంద్ర పేరిట ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బాలి నరేంద్ర, ప్రతాప్, కృష్ణంరాజు, జగన్, సన్యాసిరాజు, డివిజన్ అధ్యక్షుడు పాపారావు, మొయిద ఆదిబాబు, ప్రసాదరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

డెంకాడ: మండలంలోని గుండాలపేట, చింతలవలస ప్రభుత్వ పాఠశాలల్లో చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎఫ్‌వైఎఫ్‌పీ విద్యార్థి సంస్థ సభ్యులు విద్యార్థులకు పలు రకాల పోటీలను శనివారం నిర్వహించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ సాంస్కృతిక, సాహిత్య, సాంకేతిక, క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించి, విద్యార్థులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో ఎస్. మోహన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ ఎన్. షణ్ముఖరావు, విద్యార్థి సమన్వయకర్త కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల తనిఖీ

నెల్లిమర్ల రూరల్: మండల కేంద్రంలోని ఈవీఎం గొడౌన్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎంల తనిఖీలో పాటిస్తున్న నిబంధనలపై సిబ్బందితో మాట్లాడి ఆరా తీశారు. ఈవీఎంల తనిఖీ సంతృప్తికరంగా జరుగుతున్నట్లు ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు సీఈఓకు వివరించారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, ఆర్‌డీఓ ఎం. సూర్యకళ, తదితరులు పాల్గొన్నారు.

37 మందికి ఉద్యోగాలు

విజయనగరం అర్బన్: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో విజయనగరం ప్రభుత్వ ఐటీఐలో శనివారం జరిగిన జాబ్ మేళాకు విశేషస్పందన లభించింది. మేళాలో వివిధ ప్రాంతాల నుంచి 71 మంది అభ్యర్థులు హాజరుకాగా 37 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు జిల్లా ఉపాధి అధికారిని డి.అరుణ తెలిపారు. నవత రోడ్ ట్రాన్స్ పోర్ట్ (విశాఖ), పేటీఎం స్మార్ట్ సరీ్వస్, ముత్తూట్ ఫైనాన్స్ (విశాఖ) సంస్థ ప్రతినిధులు మేళా నిర్వహించారు. కార్యక్రమంలో కంపెనీల హెచ్‌ఆర్‌లు వేదవ్యాస్, కృష్ణ, పవన్, ఎం.యశ్వంత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల: నగర పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దోర సూర్యనారాయణ కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు శనివారం పరామర్శించారు. సూర్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శనివారం మృతుడి ఇంటికి వెళ్లి సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుడి కుమారుడు బుజ్జి, తదితరులున్నారు.

గరికిపేటలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గరికిపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుంటమాని రాజబాబును ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సూర్యనారాయణరాజు పరామర్శించారు. రాజబాబు సతీమణి, మాజీ సర్పంచ్ గుంటమాని సింహాచలం ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ రాజబాబును పరామర్శించి ఓదార్చారు.

9 నుంచి నెల్లిమర్లలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

- వైఎస్సార్‌సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల



చిక్కాల సాంబశివరావు

నెల్లిమర్ల: నగర పంచాయతీలో ఈనెల 9 నుంచి 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల పట్టణ శాఖ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పట్టణంలో 8 వార్డు సచివాలయాల పరిధిలో ఏడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. 9,10 తేదీల్లో మొయిద జంక్షన్ -1,2 సచివాలయాల పరిధిలోను... 14, 15 తేదీల్లో జరజాపుపేట-1,2 సచివాలయాల పరిధిలో.. 16న ఇందిరానగర్‌కాలనీ.. 17న గాంధీనగర్ కాలనీ.. 21న పద్మశాలివీధిలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

సేవలందించడంలోనే సంతృప్తి



సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం టౌన్: నిరుపేదలకు సేవలందించడంలోనే సంతృప్తి ఉంటుందని జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జీతో) చైర్‌పర్సన్ రీమా కొఠారి అన్నారు. పంచముఖ హనుమాన్ ఆలయం సమీపంలో ఉన్న కార్యాలయ ఆవరణలో నిరుపేదలకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తాము చేపట్టిన సేవా కార్యక్రమాలకు స్పందించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి స్పందించి రూ. 5వేల వితరణ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ జ్యోతి బచావత్, హర్షితా సురానా, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం పరిశీలన



కొత్త ఓటరు నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ ధర్మరాజు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జరజాపుపేటలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ ధర్మరాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లోనూ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని కోరారు. మృతి చెందిన వారితో పాటు డబుల్ ఎంట్రీలు ఉన్న ఓటర్లను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డీటీ శైలజ, వైస్ చైర్మన్ రామారావు, నాయకులు వాసు, సత్యనారాయణ, నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తం

- వన్‌టౌన్ సీఐ వెంకటరావు



అపార్ట్‌మెంట్ వాసులకు సూచనలు చేస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: అపార్ట్‌మెంట్ ఇళ్లల్లో దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అన్నారు. ఎస్పీ ఆదేశాలతో వన్‌టౌన్, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా వెంకటేశ్వరా రాయల్, రత్నం మెడోస్ అపార్ట్‌మెంట్ ఇళ్లల్లో నివాసం ఉంటున్న ప్రజలతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఇటీవల కాలంలో అపార్ట్‌మెంట్ ఇళ్లల్లో కూడా దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. అపార్ట్‌మెంట్‌లకు వస్తున్న కొత్త వ్యక్తుల సమాచారం తప్పకుండా తెలుసుకోవాలని సూచించారు. వాచ్‌మెన్‌లను నియమించుకోవాలని, వస్తున్న వ్యక్తుల వివరాలు, ఫోన్ నంబర్లను రికార్డుల్లో నమోదు చేసుకోవాలన్నారు. అలాగే నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని.. అనుమానిత వ్యక్తుల సమాచారాన్ని పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. సీసీఎస్ సీఐ ఎం.బుచ్చిరాజు మాట్లాడుతూ, సీసీ కెమెరాల ఏర్పాటుపై అపార్ట్‌మెంట్ కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై అశోక్‌కుమార్, సీసీఎస్ ఎస్సై గోపాలస్వామి, ఇతర పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి..

పూసపాటిరేగ: సమాజానికి ఉపయోగపడే సేవలు చేసినప్పుడే గుర్తింపు లభిస్తుందని వెంపడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.లచ్చన్న అన్నారు. ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని సుమారు లక్ష రూపాయల సొంత నిధులతో అభివృద్ధి చేసిన వెంపడాం గ్రామానికి చెందిన పిన్నింటి చంద్రశేఖరరావును ఉపాధ్యాయులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ, ప్రతిఒక్కరూ సాయం చేయాలనే తత్వం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి. నాగేశ్వరరావు, ఎ.గణేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: మండలంలోని సారిక సమీపంలో ఉన్న ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శనివారం కనులపండువగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు పీవీజీ చాణక్య, జీఎస్ హర్ష ఆధ్వర్యంలో ఉదయం 7 గంటలకు స్నపనం, పంచామృతాభిషేకం, సహస్రనామ కుంకుమార్చనలు చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణం జరిపించారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజ వల్లి దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంవీ రమణ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణల పేటెంట్లతో దేశ భవిష్యత్‌కు పునాది



కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్య అతిథి విమల్‌కుమార్ వరుణ్

డెంకాడ: ఆవిష్కరణల పేటెంట్లు దేశ భవిష్యత్‌కు పునాదని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ, సైంటిస్ట్ ఎఫ్ అండ్ చీఫ్ టెక్నాలజీ హెడ్ విమల్‌కుమార్ వరుణ్ అన్నారు. జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో పేటెంట్ ఇన్‌ఫర్మేషన్ ఐపీసీ అండ్ ఈ లెర్నింగ్ రిసోర్స్, పేటెంట్ సెర్చ్ స్ట్రేటజీస్ ఫర్ టెక్నాలజీ ల్యాండ్ స్కేపింగ్ అంశంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేటెంట్ ఏవిధంగా రిజిస్టర్ చేసుకోవాలో వివరించారు. పలు రంగాల పరిశ్రమల పేటెంట్స్ వల్ల అభివృద్ధి, వ్యాపార పురోగతి చెందుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తమ్మినేని హరిబాబు, ఇంక్ బేషన్ సెల్ ఇన్‌చార్జ్ ఏవీ పరాంకుశం, విభాగాధిపతులు పి.తిరుమల, ఎం.రాజన్‌బాబు, వి.ప్రసాద్, బి.శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రూప్ 1 విజేతకు సత్కారం



డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైన పావని, తల్లిదండ్రులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నెల్లిమర్ల రూరల్: ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి ఉన్నత ఉద్యోగానికి ఎంపికైన పూర్వ విద్యార్థినికి అరుదైన గౌరవం దక్కింది. తాను చదివిన పాఠశాలలోనే తల్లిదండ్రులతో పాటు ఘన సత్కారం పొందింది. వివరాల్లోకి వెళితే... మండలంలోని అలుగోలు గ్రామానికి చెందిన కెల్ల ఉదయపావని తన మొదటి ప్రయత్నంలోనే గ్రూప్-1లో విజయకేతనం ఎగురవేసి డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైంది. స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరుకు చదువుకున్న ఉదయపావని ఉన్నత ఉద్యోగానికి ఎంపికైన నేపథ్యంలో ఉపాధ్యాయులు శనివారం సత్కార సభ ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులతో కలిసి ఉదయ పావనిను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కాంతారావు మాట్లాడుతూ.. మారుమూల గ్రామంలో పుట్టి పెరిగిన పావని తొలి ప్రయత్నంలోనే డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికై తల్లిదండ్రులకు, గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చిందని కొనియాడారు. గ్రూప్ 1 విజేత పావని మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు

- ఎంపీపీ కల్యాణి



అధికారులను సన్మానిస్తున్న ఎంపీపీ కల్యాణి, తదితరులు

పూసపాటిరేగ: ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు సమర్థవంతంగా అందించడం ఆనందదాయకమని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో విజయవంతంగా సేవలు అందించిన వైద్యారోగ్యశాఖ, ఐసీడీఎస్, రెవెన్యూ, మండల పరిషత్ ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు మెరుగైన సేవలు అందించారని కొనియాడారు. నిరుపేదలకు ఇంటి వద్దే వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఎన్. సత్యనారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, ఎంపీడీఓ ఎం. రాధిక, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, వైద్యాధికారులు రాజేష్‌వర్మ, భాగ్యరేఖ, త్రినాథ్, ప్రమీలాదేవి, తదితరులు పాల్గొన్నారు.